క్లుప్తంగా

సమ్మె తాత్కాలిక వాయిదా

మిర్యాలగూడ అర్బన్ : రాష్ట్రంలో అసెంబ్లీ ఎన్నికల షెడ్యూల్ విడుదల కావడంతో ఏఐటీయూసి రాష్ట్ర కమిటీ ఆదేశాల మేరకు మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు ఆ సంఘం జిల్లా ఉపాధ్యక్షులు ఎండీ సయ్యద్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. 20 రోజులుగా కార్మికుల సమస్యల పరిష్కారం కోసం సమ్మె చేపట్టినా ప్రభుత్వం స్పందించక పోవడం దారుణమన్నారు. పాలకులు దిగి వచ్చి కార్మికుల సమస్యలను పరిష్కరించేంత వరకు తమ పోరాటాలు ఆగవని, కార్మికులకు ఎర్ర జెండా అండగా నిలుస్తుందని పేర్కొన్నారు.

దరఖాస్తుదారుల భూముల పరిశీలన

చందంపేట : ధరణి ద్వారా భూ సమస్యలపై దరఖాస్తు చేసుకున్న దరఖాస్తు దారులకు సంబంధించి సమస్యలపై స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ శ్రీదేవి సోమవారం క్షేత్రస్థాయిలో రైతుల భూములను పరిశీలించారు. మండలంలోని రేకులగడ్డ, యాపలపాయతండాలలో క్షేత్రస్థాయిలో భూములను పరిశీలించి వివరాలు తెలుసుకున్నారు. భూముల సమస్యలను పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఆమె వెంట తహసీల్దార్ రాములు, పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి, ఆర్ఐ నజీర్, సర్పంచులు ఎడ్ల లక్ష్మమ్మ, రగయ్య, అంజయ్య, సుశీలశంకర్‌నాయక్, ఉప సర్పంచ్ రావుల శ్రీనివాస్, వెంకటయ్య, జలేందర్ తదితరులున్నారు.

చెక్కు అందజేత

మిర్యాలగూడ : దామరచర్ల మండలంలోని గాంధీనగర్‌కు చెందిన గీత కార్మికుడు పోతునూరి శ్రీనివాస్‌గౌడ్ ఇటీవల తాటి చెట్టుపై నుంచి పడి మృతిచెందాడు. విషయం తెలుసుకున్న గీత కార్మిక కార్పొరేషన్ చైర్మన్ పల్లె రవికుమార్ ఆదేశానుసారం తక్షణ సహాయం కింద రూ.25వేలు మంజూరు కాగా ఆ చెక్కును సోమవారం శ్రీనివాస్‌గౌడ్ కుటుంబసభ్యులకు గీత కార్మిక కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ కొండ జానయ్యగౌడ్ అందజేశారు. త్వరలోనే రూ.5లక్షల ఎక్స్‌గ్రేషియా అందించనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ సంఘం నాయకులు శ్రీనివాస్, శ్రీరాములుగౌడ్, లక్ష్మణ్, ఎక్సైజ్ ఎస్ఐ సైదులు పాల్గొన్నారు.

విద్యుదాఘాతంతో ఆవులు, గేదె మృతి

అడవిదేవులపల్లి : విద్యుదాఘాతంతో రెండు ఆవులు, గేదే మృతి చెందిన సంఘటన మండలంలోని హాంతండాలో సోమవారం చోటు చేసుకుంది. బాధితుడు కుర్ర బిక్కు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన బిక్కు ఇంటికి వెళ్లే విద్యుత్ సర్వీస్ వైరు ఆవులు, గేదెలు ఉండే రేకుల షెడ్డుకు అనుసంధానంగా ఉన్న ఐరన్ పోలు రేకుల పైభాగంలో కట్టారు. సర్వీస్ వైరు ఇన్సులేషన్ పోవడంతో దానికి అనుబంధంగా ఉన్న ఇనుప పోలుకు విద్యుత్ సరఫరా కావడంతో షెడ్డులో ఉన్న రెండు ఆవులు, ఒక గేదే విద్యుధాఘాతానికి గురై మృతిచెందాయి. సుమారు రూ.2లక్షల మేర నష్టం వాటిల్లిందని బాధితుడు కన్నీరు పెట్టుకున్నారు.

నిర్మాణ పనులు అడ్డుకున్న పోలీసులు

కొండమల్లేపల్లి : మండల కేంద్రంలోని హైదరాబాద్ రోడ్డులోని మల్లెలగట్టు సమీపంలో ఉన్న సర్వే నంబర్ 107లో రెండు ఎకరాల స్థలాన్ని కొండమల్లేపల్లి పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించారు. ఇదిలా ఉంటే 2004లో సదరు సర్వే నంబర్‌లోని 1.10 ఎకరాల భూమిని నాయీ బ్రాహ్మణులకు ప్రభుత్వం అప్పట్లో ఇళ్ల స్థలాలను కేటాయించగా నిర్ణీత సమయంలోగా ఇంటి నిర్మాణాలు చేపట్టకపోవడంతో ఇళ్ల పట్టాలు రద్దు చేస్తూ పోలీస్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించారు. సోమవారం కొండమల్లేపల్లిలో పలు అభివృద్ధి పనుల్లో పాల్గొనేందుకు వచ్చిన ఎమ్మెల్యే రవీంద్రకుమార్ దృష్టికి నాయీ బ్రాహ్మణులు తమ గోడును వివరించారు. ఇదిలా ఉంటే ఎమ్మెల్యే సానుకూలంగా స్పందించారని పేర్కొంటూ హద్దు ఏర్పాటుకు గాను జేసీబీతో గుంతలు తవ్వారు. ఈ విషయం తెలుసుకున్న పోలీసులు అక్కడికి చేరుకొని పనులను అడ్డుకున్నారు. ఈ విషయమై సీఐ రాఘవేందర్‌రెడ్డిని వివరణ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తాము వ్యవహరిస్తున్నట్లు తెలిపారు.

అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ పనులకు శంకుస్థాపన

చందంపేట : చందంపేట మండలంలోని చిత్రియాల గ్రామంలో సోమవారం రూ.30లక్షలతో చేపడుతున్న అండర్ గ్రౌండ్ డ్రెయినేజీ నిర్మాణ పనులకు చిత్రియాల పీఏసీఎస్ చైర్మన్ జాలె నర్సింహారెడ్డి శంకుస్థాపన చేశారు ఈ కార్యక్రమంలో ఎంపీపీ పార్వతీచందునాయక్, జెడ్పీటీసీ బుజ్జి, నాయకులు పాల్గొన్నారు.

తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా

పెద్దఅడిశర్లపల్లి : దళితులందరికీ దళితబంధు వెంటనే అమలు చేయాలని కోరుతూ మండల కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో సోమవారం గుడిపల్లి మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు చంద్రారెడ్డి, భద్రయ్య, రుక్మారెడ్డి, మల్లారెడ్డి, నర్సిరెడ్డి, యాదయ్య, వెంకటయ్య, రవి పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ హయాంలోనే అభివృద్ధి

- మిర్యాలగూడ ఎమ్మెల్యే భాస్కర్‌రావు

మిర్యాలగూడ : బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే మిర్యాలగూడ పట్టణం అన్ని విధాలుగా అభివృద్ధి చెందిందని ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు అన్నారు. సోమవారం పట్టణంలోని పలు వార్డుల్లో సీసీ రోడ్డు, డ్రెయినేజీ నిర్మాణ పనులను రాష్ట్ర ఆగ్రోస్ చైర్మన్ తిప్పన విజసింహారెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ పట్టణాభివృద్ధే లక్ష్యంగా పని చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ కుర్ర విష్ణు, డీసీసీబీ డైరెక్టర్ బంటు శ్రీనివాస్, మార్కెట్ డైరెక్టర్ పత్తిపాటి నవాబ్, సీనియర్ నాయకులు అన్నభీమోజు నాగార్జునచారి, నాయకులు పెద్ది శ్రీనివాస్‌గౌడ్, గిరి, పద్మ, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ ఉపాధ్యక్షులు రమేష్, మిర్యాలగూడ అధ్యక్షులు గౌరు శ్రీనివాస్, నాయకులు శ్యాంసుందర్, నిరంజన్‌రెడ్డి, వెంకమ్మ, అలివేలు, తిరుమలగిరి వజ్రం, కూనల గోపాలకృష్ణ, గంగాధర్, అజీజ్, సలీం, ఖలీల్ పాల్గొన్నారు.



సీసీ రోడ్డు పనులను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు

బీఆర్ఎస్‌లో చేరిక

పట్టణంలోని సుందర్‌నగర్‌కు చెందిన 50 మంది మహిళలు మున్సిపల్ చైర్మన్ తిరునగరు భార్గవ్ ఆధ్వర్యంలో సోమవారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్‌రావు సమక్షంలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. రాబోయే ఎన్నికల్లో మహిళలు బీఆర్ఎస్ పార్టీకి అండగా ఉండాలన్నారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నియోజకవర్గ యువ నాయకుడు నల్లమోతు సిద్ధార్థ, బీఆర్ఎస్ పట్టణ ప్రధాన కార్యదర్శి పెద్ది శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్ ఉదయ్‌భాస్కర్, పెరపాక నిర్మలాదేవి, వట్టిపు సునీత, పేరమ్మ, వెంకటమ్మ, రమణ, సైదమ్మ, గజ్జల సునీత, శైలజ తదితరులు పాల్గొన్నారు.



గులాబీ కండువా కప్పి బీఆర్ఎస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే భాస్కర్‌రావు

చెక్కు అందజేత

మండలంలోని కొత్తపేట గ్రామానికి చెందిన రేణుక గేదే ఇటీవల విద్యుదాఘాతంతో మృతిచెందగా విద్యుత్‌శాఖ ద్వారా మంజూరైన రూ.40వే చెక్కును ఆమెకు సోమవారం ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు అందజేశారు.

బీఆర్‌ఎస్‌కు కార్యకర్తలు, నాయకులే బలం

- సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్

హాలియా : బీఆర్ఎస్ పార్టీకి నాయకులు, కార్యకర్తలే బలం, బలగమని సాగర్ ఎమ్మెల్యే నోముల భగత్ అన్నారు. సోమవారం హాలియా పట్టణంలో ఇంటింటికి జెండా పండుగ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. అదే విధంగా పట్టణంలోని రూ.4కోట్లతో నూతనంగా నిర్మించనున్న గిరిజన బంజారా భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే భగత్ శంకుస్థాపన చేసి మాట్లాడారు. తెలంగాణ రాష్ట్రంలో పదేళ్లుగా సీఎం కేసీఆర్ జనరంజక పాలన అందిస్తున్నట్లు తెలిపారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా తెలంగాణ రాష్ట్రంలో అనేక సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు అమలు చేస్తున్నారన్నారు. తలసరి ఆదాయంలో తెలంగాణ రాష్ట్రం నేడు దేశంలోనే మొదటిస్థానంలో ఉందన్నారు. రానున్న ఎన్నికల్లో నాగార్జున సాగర్ నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీ గెలుపునకు పార్టీ కార్యకర్తలు సైనికుడిలా పని చేయాలని కోరారు.

బీఆర్ఎస్‌లో చేరిక..

నిడమనూరు మండలంలోని ఇండ్ల కోటయ్యగూడెం గ్రామ పరిధిలోని మారుతివానిగూడెం గ్రామానికి చెందిన పలువురు కార్యకర్తలు ఎమ్మెల్యే నోముల భగత్ సమక్షంలో బీఆర్ఎస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి ఆయన బీఆర్ఎస్ కండువా కప్పి పార్టీలో ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో ట్రైకార్ చైర్మన్ ఇస్లావత్ రాంచందర్ నాయక్, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర నాయకులు సాదం సంపత్‌కుమార్, నిడమనూరు మార్కెట్ కమిటీ చైర్మన్ మర్ల చంద్రారెడ్డి, వెంకటేశ్వర్లు, పిడిగం నాగయ్య, బిక్షానాయక్, సత్యనారాయణరెడ్డి, సర్పంచ్ శ్రీనివాస్‌రెడ్డి, కృష్ణ యాదవ్, నాయకులు, పాల్గొన్నారు.



ఇంటింటికీ జెండా పండుగ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే నోముల భగత్

ఆరు గ్యారంటీలపై ప్రచారం చేయాలి



కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జైవీర్‌రెడ్డి

త్రిపురారం : సోనియా గాంధీ ప్రకటించిన ఆరు గ్యారంటీలపై కార్యకర్తలు గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం చేయాలని కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు కుందూరు జైవీర్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల కేంద్రంలో సాగర్ రోడ్డులో కాంగ్రెస్ పార్టీ కార్యాలయాన్ని మండల నాయకులతో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో జైవీరెడ్డి మాట్లాడారు. మండల కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడు శ్రీనివాస్ రెడ్డి అనారోగ్యంతో బాధపడుతుండగా జైవీర్‌రెడ్డి పరామర్శించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ అనుముల పాండమ్మ, జెడ్పీటీసీ ధనావత్ భారతీ, మండల అధ్యక్షుడు ముడిమళ్ల బుచ్చి రెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ధనావత్ భాస్కర్ నాయక్, ఎంపీపీ గౌరవ సలహాదారు అనుముల శ్రీనివాస్ రెడ్డి, వర్కింగ్ ప్రెసిడెంట్ బిట్టు రవి కుమార్, అంబటి సోమయ్య, పీబీ రవి, త్రిపురారం గ్రామ శాఖ అధ్యక్షుడు అనుముల వెంకట్ రెడ్డి, అలంపల్లి జానయ్య, సలికంటి బాల కృష్ణ, అమరేందర్ రెడ్డి, సైదులు, హనుమయ్య పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌లో చేరిక

నిడమనూరు : మండల కేంద్రానికి చెందిన బీఆర్ఎస్ లీడర్ ఉన్నం చిన వీరయ్య సోమవారం మాజీ సీఎల్పీ నేత కుందూరు జానారెడ్డి సమక్షంలో కాంగ్రెస్‌లో చేరారు. ఉన్నం చిన వీరయ్య గతంలో కుందూరు జానారెడ్డికి ప్రధాన అనుచరుడిగా, కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడిగా ఉన్నా, సాగర్ ఉప ఎన్నికల సందర్భంగా అధికార పార్టీలో చేరారు. సోమవారం తిరిగి కాంగ్రెస్‌లో చేరారు. ఈ సందర్భంగా ఉన్నం చిన వీరయ్యకు కండువా కప్పి పార్టీలోకి జానారెడ్డి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ కర్నాటి లింగారెడ్డి, తుమ్మలపల్లి శేఖర్‌రెడ్డి, మేరెడ్డి వెంకట్‌రాహుల్, అంకతి వెంకటరమణ, లక్ష్మారెడ్డి, వంశీచరణ్, రమేష్, పురుషోత్తంరెడ్డి, కృష్ణ వివేక్, శ్యామ్ ఉన్నారు.

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ పట్టణానికి చెందిన 50 మంది బీఆర్ఎస్ కార్యకర్తలు పట్టణ కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ ఎంఏ సలీం ఆధ్వర్యంలో సోమవారం మాజీ మంత్రి కుందూరు జానారెడ్డి సమక్షంలో గాంధీభవన్‌లో కాంగ్రెస్ పార్టీలో చేరారు. పార్టీలో చేరిన వారికి కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్ పార్టీలో చేరిన వారిలో ఎస్‌కె రహీమ్, సందీప్, కొమ్ము శేఖర్, గుండెబోయిన ప్రదీప్ యాదవ్, దిలీప్‌కుమార్, సాంబశివుడు యాదవ్, ఇంజమూరీ శివాజీ, ప్రదీప్, సత్యంలు ఉన్నారు. వీరి వెంట డీసీసీ అధ్యక్షులు కేతావత్ శంకర్‌నాయక్, యువజన కాంగ్రెస్ జిల్లా రాజరమేష్ యాదవ్, పోదిల వెంకన్న, నీరుకంటి నారాయణ ఉన్నారు.



ఉన్నం చిన వీరయ్యను కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న జానారెడ్డి

అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయం

- ఎమ్మెల్యే రవీంద్రకుమార్

కొండమల్లేపల్లి : రాష్ట్రంలోని అన్ని వర్గాల సంక్షేమమే ధ్యేయంగా పనిచేస్తుందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం కొండమల్లేపల్లి పట్టణంలో మట్టి పాత్రల తయారీ, శిక్షణ కేంద్ర భవన నిర్మాణ పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కుమ్మరి కులస్తుల సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంబీసీ చైర్మన్ శ్రీనివాస్, ఎంపీపీ రేఖరెడ్డి, సర్పంచ్ కుంభం శ్రీనివాస్‌గౌడ్, కేసాని లింగారెడ్డి, రమావత్ దస్రూనాయక్, మేకల శ్రీనివాస్‌యాదవ్, ఎలిమినేటి సాయి, మాద్గుల యాదగిరి, వస్కుల శ్రీనివాస్, వెంకటయ్య తదితరులు పాల్గొన్నారు.

కేసీఆర్ హయాంలో గ్రామాలకు మహర్దశ

దేవరకొండ : సీఎం కేసీఆర్ హయాంలో గ్రామాలకు మహర్దశ వచ్చిందని దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ అన్నారు. సోమవారం దేవరకొండ మండలం కాసారం వద్ద రూ.5.20కోట్లు, గొట్టిముక్కల గ్రామంలో రూ.2.14కోట్లతో చేపట్టిన బీటీ రోడ్ల రెన్యువల్ పనులకు, అమ్మటోనిగూడెం తండా వద్ద రూ.59లక్షలతో చేపడుతున్న కాల్వ పనులకు ఆయన శంకుస్థాపన చేసి మాట్లాడారు. . ఈ కార్యక్రమంలో మారుపాకల సురేష్‌గౌడ్, చింతపల్లి సుభాష్‌గౌడ్, సర్పంచ్‌లు అయ్యన్న, అంజయ్య, నాయకులు బొడ్డు గోపాల్‌గౌడ్, యాదయ్య, దీప్ల, బధ్యానాయక్, పర్వతాలు, హరికృష్ణ, పాల్గొన్నారు.



బీటీ రోడ్డు పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రకుమార్

బీఆర్ఎస్ గెలుపు ఖాయం

చింతపల్లి : అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలుపు ఖాయమని ఆ పార్టీ జిల్లా అధ్యక్షులు దేవరకొండ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ దీమా వ్యక్తం చేశారు. సోమవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్ఎస్ సర్కార్ అమలు చేస్తున్న ప్రజాసంక్షేమ పథకాలు, రాష్ట్రంలో జరుగుతున్న అభివృద్ధే మూడోసారి బీఆర్ఎస్ పార్టీని అధికారంలోకి తీసుకొస్తాయన్నారు. ఇప్పటికే గ్రామాల్లో పెద్ద సంఖ్యలో కార్యకర్తలు గులాబీ తీర్థం పుచ్చుకుంటున్నారన్నారు. ఈ సమావేశంలో జడ్పీటిసి కంకణాల ప్రవీణ వెంకట్‌రెడ్డి, మండల పార్టీ అధ్యక్షుడు దొంతం చంద్రశేఖర్‌రెడ్డి, సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గున్‌రెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, ఉజ్జిని విద్యాసాగర్‌రావు, గోపిడి కిష్టారెడ్డి, ఎల్లంకి అశోక్, ఆర్ఎన్.ప్రసాద్, అక్రంయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు సరిపడా ఆహారం అందించాలి

మిర్యాలగూడ : ప్రభుత్వ పాఠశాల పేద విద్యార్థులకు అందిస్తున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకంలో భాగంగా విద్యార్థులకు సరిపడా ఆహారాన్ని అందించాలని కలెక్టర్ ఆర్‌వి.కర్ణన్ అధికారులను ఆదేశించారు. సోమవారం పట్టణంలోని షాబునగర్ ప్రభుత్వ పాఠశాలలో అమలవుతున్న ముఖ్యమంత్రి అల్పాహార పథకాన్ని కలెక్టర్ పరిశీలించి విద్యార్థులతో మాట్లాడారు. ఉదయం పాఠశాలకు వచ్చే ముందు మీరు తినే వస్తున్నారా అని అడగగా అందరం ఏమి తినకుండానే వస్తున్నామని కలెక్టర్‌తో చెప్పారు. విద్యార్థుల శారీరక, మానసిక వికాసానికి దోహదపడే విధంగా అన్ని పోషక విలువలుగల అల్పాహారాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. ఆయన వెంట ఎంపీడీఓ గార్లపాటి జ్యోతిలక్ష్మీ, మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్ రావు, ఎంఈఓ బాలాజీనాయక, ఎంపీఓ వీరారెడ్డి, ప్రధానోపాధ్యాయులు సారయ్య, హరి పాల్గొన్నారు.



అల్పాహారాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ కర్ణన్

రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు



శిర్సనగండ్ల చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్సీ కోటిరెడ్డి

పెద్దవూర : రాజకీయాలకు అతీతంగా తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ పథకాలు అందజేస్తున్నట్లు ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి తెలిపారు. . సోమవారం మండలంలోని శిర్సనగండ్ల గ్రామంలోని చెరువులో ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేసిన చేపపిల్లలను వదిలి మాట్లాడారు. మత్స్యకారుల జీవనోపాధి కోసం రాష్ట్రవ్యాప్తంగా చెరువులు, రిజర్వాయర్‌లలో ప్రభుత్వం ఉచితంగా చేపపిల్లలను వదులుతున్నట్లు తెలిపారు. వీటితో పాటు సబ్సిడీపై మోపెడ్‌లు, రవాణా ఆటోలు, వలలను అందజేసినట్లు తెలిపారు. అనంతరం మండలంలోని పెద్దగూడెం గ్రామ పంచాయతీ పరిధిలోని పెద్దగూడెం, చిన్నగూడెం గ్రామాలలో ఎమ్మెల్సీ నిధుల నుంచి మంజూరైన రూ.30 లక్షలతో సీసీ రోడ్డు నిర్మాణ పనులను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో పెద్దవూర, తిరుమలగిరి, అనుముల ఎంపీపీలు చెన్ను అనురాధసుందర్‌రెడ్డి, భగవాన్‌నాయక్, సుమతిపురుషోత్తం, సర్పంచ్‌లు కూన్‌రెడ్డి మల్లారెడ్డి, అంజయ్య, నాయకులు బెడుదూరి వెంకట్‌రెడ్డి, పవన్, నాగిరెడ్డి, చంద్రకళ, కోటిరెడ్డి, పాల్గొన్నారు.

మిర్యాలగూడలో కాషాయ జెండా ఎగురవేస్తాం

మిర్యాలగూడ టౌన్ : అసెంబ్లీ ఎన్నికల్లో మిర్యాలగూడ నియోజకవర్గంలో కాషాయ జెండా ఎగురవేస్తామని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సాధినేని శ్రీనివాస్‌రావు, నియోజకవర్గ ఇన్‌చార్జ్ రతన్‌సింగ్‌నాయక్ అన్నారు. సోమవారం పట్టణంలో అసెంబ్లీ నాయోజకవర్గ స్థాయి బీజేపీ ప్రజా సంఘాల సమావేశం ఏర్పాటు చేశారు. అనంతరం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షులు పురుషోత్తం రెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి రమేశ్, సత్యప్రసాద్, శ్యాం, శ్రీనివాస్‌రెడ్డి, సరిత, శేఖర్, వెంకట్ రెడ్డి, పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సాధినేని శ్రీనివాసరావు

తెలంగాణలో వచ్చేది బీజేపీ ప్రభుత్వమే



కండువాలు కప్పి బీజేపీలోకి ఆహ్వానిస్తున్న జిల్లా అధ్యక్షుడు శ్రీధర్‌రెడ్డి

పెద్దవూర : తెలంగాణ రాష్ట్రంలో బీఆర్ఎస్‌కు నూకలు చెల్లిపోయాయని, రాబోయేది బీజేపీ ప్రభుత్వమేనని బీజేపీ జిల్లా అధ్యక్షుడు కంకణాల శ్రీధర్‌రెడ్డి అన్నారు. సోమవారం గుర్రంపోడు మండలంలోని పలు గ్రామాలకు చెందిన పలువురు బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలకు చెందిన కార్యకర్తలు బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జ్ కంకణాల నివేదితారెడ్డి ఆధ్వర్యంలో పెద్దవూరలోని క్యాంపు కార్యాలయంలో ఆయన సమక్షంలో బీజేపీలో చేరారు. వీరికి ఆయన బీజేపీ కండువాలను కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో కుటుంబ, రాచరిక పాలనకు ప్రజలు చరమగీతం పాడనున్నట్లు పేర్కొన్నారు. పార్టీలో చేరిన వారిలో మాల రవీందర్‌రెడ్డి, బొల్లు కృష్ణారెడ్డి, పందుల నర్సింహా, మహంకాళి శంకర్, నిమ్మల జానయ్య, ఎడ్ల వెంకటయ్యాచ గుర్రం చక్రవర్తి, కొండల్ తదితరులు ఉన్నారు. ఈ కార్యక్రమంలో గుర్రంపోడు, పెద్దవూర బీజేపీ మండల అధ్యక్షులు వినోద్, నర్సింహా, గుర్రం ఉపేందర్, వాకిటి శివ, బద్రి నరేష్, జగన్‌నాయక్ తదితరులు పాల్గొన్నారు.

ఆశావర్కర్ల ముందస్తు అరెస్ట్

మాడుగులపల్లి : తమ న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని కోరుతూ ఆశా వర్కర్ల రాష్ట్ర కమిటీ సోమవారం హైదరాబాద్‌లో కమిషనరేట్ ముట్టడికి పిలుపునిచ్చింది. మిర్యాలగూడ నియోజకవర్గంలోని పలు మండలాల నుంచి హైదరాబాద్‌కు వెళ్తున్న ఆశావర్కర్లను మండల కేంద్ర శివారులోని టోల్‌ప్లాజా వద్ద ఉదయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మధ్యాహ్నం 12 గంటల తరువాత వ్యక్తిగత పూచీకత్తుపై విడుదల చేశారు. అరెస్టయిన వారిలో ఆశా వర్కర్ల సంఘం మండల బాధ్యులు పుల్లెంల పుష్ప, రాజేశ్వరి, జ్యోతి, సుజాత, భవాని తదితరులున్నారు.

కొండమల్లేపల్లి : హైదరాబాద్‌లోని కోటిలో ఉన్న డీఎంహెచ్ఎస్ కార్యాలయ ముట్టడి నేపథ్యంలో సోమవారం పలువురు ఆశా వర్కర్లను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా పలువురు ఆశా వర్కర్లు మాట్లాడుతూ జీఓ నంబర్ 2 ప్రకారం 30 మార్కుల వెయిటేజీ, ఏజ్ రిలాక్సేషన్, జీతాల పెంపు కోసం న్యాయబద్ధంగా సమ్మె చేస్తుంటే అడ్డుకోవడం సరికాదన్నారు. అరెస్టయిన వారిలో అందుగుల ధనమ్మ, వస్కుల యాదమ్మ, ఎం.సుజాత, గుర్రం ధనలక్ష్మి, సైదమ్మ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను శిక్షించాలని రాస్తారోకో



మృతుడి బంధువులతో మాట్లాడుతున్న పోలీసులు

చందంపేట : తన కుమారుడి మృతికి కారకులైన వారిని శిక్షించాలంటూ బంధువులు, గ్రామస్తులు సోమవారం దేవరకొండ బస్టాండు వద్ద రాస్తారోకో నిర్వహించారు. చందంపేట మండలంలోని పోలేపల్లి గ్రామపంచాయతీ పరిధిలోని బండమీదితండాకు చెందిన సపావత్ హనుమంతు(29) శనివారం పోలేపల్లి నుంచి తన స్వగ్రామమైన బండమీదితండాకు బైక్‌పై వెళ్తున్నాడు. ఈ క్రమంలోనే మార్గమధ్యలో అనుమానాస్పద స్థితిలో బైక్‌పై నుంచి కిందపడి ఉన్నాడు. ఇది గమనించిన గ్రామస్తులు గమనించి చికిత్స నిమిత్తం హైదరాబాద్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ ఆదివారం మృతి చెందాడు. ఇదిలా ఉంటే హనుమంతు భార్య తారా సోదరులే హత్యచేసి రోడ్డుపై పడవేశారని ఆరోపిస్తూ, తమకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ క్రమంలోనే సోమవారం మృతదేహానికి దేవరకొండ ప్రభుత్వాస్పత్రిలో పోస్టుమార్టం నిర్వహించారు. దీంతో మృతుడి కుటుంబానికి న్యాయం చేయాలంటూ రోడ్డుపై బైఠాయించి రాస్తారోకో నిర్వహించారు. ఈ విషయం తెలుసుకున్న డిండి సీఐ సురేష్, దేవరకొండ సీఐ నాగభూషణ్‌రావులు సంఘటనా స్థలానికి చేరుకొని వారికి నచ్చజెప్పడంతో శాంతించారు. చందంపేట, నేరెడుగొమ్ము, దేవరకొండ ఎస్ఐలు క్రాంతికుమార్, రాజు తదితరులు పోలీసులు ఉన్నారు.

యాజమాన్య పద్ధతులతోనే అధిక దిగుబడి

త్రిపురారం : పంటల్లో సరైన యాజమాన్య పద్ధతులు పాటిస్తే రైతులు అధిక దిగుబడులు సాధించవచ్చని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్ ప్రోగ్రాం కోఆర్డినేటర్ డాక్టర్ శ్రీనివాస రావు అన్నారు. సోమవారం మండలంలోని కృషి విజ్ఞాన కేంద్రం కంపాసాగర్‌లో అధిక సాంద్రత పద్ధతిలో పత్తి సాగులో రైతులు తీసుకోవాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై జిల్లాలోని రైతులకు అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వ్యవసాయ శాస్త్రవేత్తలు షేక్ మీరా, ఏఆర్ రెడ్డిలు పత్తి సాగులో ఏదురయ్యే సమస్యలు, అధిక సాంద్రత పత్తి సాగులో మేలైన యాజమాన్య పద్ధతులు, చీడ పీడల నివారణ, మార్కెటింగ్‌లో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించారు. వివిధ సాగు సంగతులు, వ్యవసాయ సాంకేతికతతో కూడిన క్యూఆర్ కోడ్‌లను విడుదల చేసి రైతులకు అందజేశారు. రాశీ సీడ్ కంపెనీ వారి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జనరల్ మేనేజర్, ప్రదీప్, సూర్య ప్రకాశ్, శాస్త్రవేత్తలు డాక్టర్ లింగయ్య, చంద్రశేఖర్, రాములమ్మ, పల్లవి రైతులు పాల్గొన్నారు.



రైతులకు అవగాహన కల్పిస్తున్న శాస్త్రవేత్తలు

కొనసాగుతున్న జిల్లా సాధన దీక్షలు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ జిల్లా సాధన కోసం ఎన్టీఆర్ కాంప్లెక్స్ వద్ద చేపట్టిన రిలే దీక్షలు కొనసాగుతున్నాయి. సోమవారం ఈ దీక్షలను విద్యుత్ ఉద్యోగులు సంఘం రాష్ట్ర నేత మారం శ్రీనివాస్ ప్రారంభించారు. తొమ్మిదో రోజు దీక్షలో కృష్ణయ్య, నర్సింహారెడ్డి, వెంకట్‌రెడ్డి, ధర్మారెడ్డి, ఏడుకొండలు, మధుసూధన్, గుప్త, దుర్గ ప్రసాద్ లైన రిటైర్డ్ ఉద్యోగులు కూర్చున్నారు. అలాగే మంగళవారం మిర్యాలగూడకు వస్తున్న ఐటీ, పురపాలక శాఖ మంత్రి కేటీఆర్ మిర్యాలగూడ జిల్లాను ప్రకటించాలని కోరుతూ ఆయన ఫ్లెక్సీ వద్ద పట్టణ ప్రజలు వేడుకున్నారు. ఈ కార్యక్రమంలో మిర్యాలగూడ రిటైర్డ్ ఉద్యోగుల సంఘం అధ్యక్షులు బంటు శేషు, డాక్టర్ జాడీ రాజు, జయరాజు, కోలా సైదులు, దుర్గాప్రసాద్, ధనావత్ ఉషానాయక్, జిల్లా సాధన సమితి నాయకులు మారం శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆర్యవైశ్యులంతా ఒక్కతాటిపై నడవాలి

పెద్దఅడిశర్లపల్లి : ఆర్యవైశ్యులంతా ఒక్కతాటిపై నడవాలని ఆర్య వైశ్య సంఘం జిల్లా అధ్యక్షుడు వనమా వెంకటేశ్వర్లు అన్నారు. సోమవారం మండల కేంద్రంలో నిర్వహించిన ఆర్యవైశ్య సంఘ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. అనంతరం సంఘం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఈసందర్భంగా ఎన్నికైన వారికి నియామక పత్రాలు అందజేశారు. ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా అంగడిపేటకు చెందిన విడియాల రామయ్య, కార్యదర్శిగా సముద్రాల శేఖర్, కోశాధికారిగా మిర్యాల సత్యంలు ఎన్నికయ్యారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



ఉపాధ్యాయులతో పూర్వ విద్యార్థులు

చందంపేట : నేరెడుగొమ్ము ఆదర్శ పాఠశాల, కళాశాలలో 2013–2014 బ్యాచ్‌కు చెందిన పూర్వ విద్యార్థులు ఆత్మీయ సమ్మేళనాన్ని సోమవారం నిర్వహించారు. ఈ సందర్భంగా పూర్వ విద్యార్థులు తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సన్మానించారు. పూర్వ విద్యార్థులలో ఒకరికి సివిల్ కానిస్టేబుల్ ఉద్యోగం రావడంతో అతడిని సన్మానించారు.

సమగ్రాభివృద్ధే లక్ష్యంగా పనిచేయాలి

హాలియా : అనుముల మండల సమగ్రాభివృద్ధే లక్ష్యంగా అధికారులు, ప్రజా ప్రతినిధులు కలిసి పనిచేయాలని అనుముల మండల ఎంపీపీ పేర్ల సుమతిపురుషోత్తం అన్నారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ పేర్ల సుమతి పురుషోత్తం అధ్యక్షతన అనుముల మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి 17మంది సర్పంచ్‌లు, ఏడుగురు అధికారులు గైర్హాజర్ కావడంతో సభ మొక్కుబడిగా సాగింది. వచ్చిన అధికారులు తూతూ మంత్రంగా ప్రగతి నివేదికలు చదివి వినిపించారు. ఈ కార్యక్రమంలో హాలియా వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ వెంకటేశ్వర్లు, ఎంపీడీఓ లక్ష్మి, వైస్ ఎంపీపీ అరుణసత్యనారాయణరెడ్డి, సూపరింటెండెంట్ సమ్మద్, ఎంఈఓ బాలునాయక్, పంచాయతీరాజ్ ఏఈ సాయి, ఏఓ సంతోషి, సీడీపీఓ పద్మావతి, ఏపీఎం కళావతి ప్రజాప్రతనిధులు ఉన్నారు.

సాదాసీదాగా సర్వసభ్య సమావేశం

పెద్దఅడిశర్లపల్లి : ప్రజా సమస్యల పరిష్కారానికి మూడు నెలలకొకసారి నిర్వహించే మండల సర్వసభ్య సమావేశం సోమవారం సాదాసీదాగా కొనసాగింది. ఎంపీపీ వంగాల ప్రతాపరెడ్డి అధ్యక్షతన నిర్వహించిన ఈసమావేశానికి ప్రజాప్రతినిధులు, అధికారులు పూర్తిస్థాయిలో హాజరుకాకపోవడంతో గంటలోపే సమావేశం ముగిసింది. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ మోహన్‌రెడ్డి, పీఏసీఎస్ చైర్మన్ వల్లపురెడ్డి, వైస్ ఎంపీపీ సరితా, ఎంపీటీసీలు బన్సీలాల్,సత్యశ్రీ,కలమ్మ,సర్పంచులు అంజిరెడ్డి, విజయలక్ష్మి, అరుణ, శ్రీనివాస్‌రెడ్డి, శివాజీ, సైదమ్మ పాల్గొన్నారు.

శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యం

హాలియా : శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పని చేస్తున్నామని, అందుకు ప్రజలు సహకరించాలని హాలియా సీఐ గాంధీనాయక్ అన్నారు. ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో సోమవారం హాలియా పట్టణంలో నిర్వహించిన కవాతు నిర్వహించారు. అనంతరం ఆయన మాట్లాడారు. శాంతి భద్రతలపై ప్రజలకు భరోసా కల్పించడానికి స్లాగ్ మార్చ్ నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ కమాండర్ టీపీ భాఘేల్, హాలియా ఎస్ఐ శోభన్‌బాబు, ముగ్గురు సీఐలు, 13 మంది ఎస్ఐలు, 100మంది పాల్గొన్నా రు.



హాలియాలో కవాతు నిర్వహిస్తున్న పోలీసులు